ఇదేనా..'చెత్త' శుద్ధి



మిరుదొడ్డిలో దర్శనమిస్తున్న చెత్త కుప్పలు

అధికారుల ప్రత్యేక పాలనలో చిత్తశుద్ధి లేక ఆయా గ్రామాల్లో చెత్తాచెదారం పేరుకుపోతున్నాయి. వీధుల్లో పేరుకు పోతున్న చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించక పోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా పంచాయతీల్లో చిల్లిగవ్వ లేదని ప్రత్యేక పాలనాధికారులు చేతులెత్తేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో పేరుకు పోతున్న చెత్త కుప్పలను, పెరిగి పోతున్న పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు. మిరుదొడ్డి(దుబ్బాక):

డేంజర్ 'దారి'



ప్రమాదకరంగా మారిన కట్టు కాలువ స్లాబు

స్థానిక పెద్ద చెరువు కట్టు కాలువ స్లాబుపై నుంచి భారీ వాహనాలు వెళ్లడంతో స్లాబు పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు సీసీరోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. తరచూ వాహనాలు ప్రమాదాలకు గురి కావడంతో వాహనదారులు ఆస్పత్రుల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కాలువపై పటిష్టమైన స్లాబును నిర్మించడంతోపాటు సీసీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు. మిరుదొడ్డి(దుబ్బాక):

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి లక్ష పుష్పార్చన



పుష్పార్చనలో వేదపండితులు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరాలయం కృత్తిక మహోత్సవంతో అలరారింది. ఆదివారం తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి ఆధ్వర్యంలో వేదపండితులు స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి లక్షపుష్పార్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వంతెన లేక ఇబ్బందులు



నిరసన వ్యక్తం చేస్తున్న నాయికులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గు గ్రామ శివారులోని లో-లెవల్ బ్రిడ్జి ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపట్టాలని, వంతెన లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి వెంకట్‌మావో డిమాండ్ చేశారు. ఆదివారం లో-లెవల్ వంతెన ప్రాంతంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా పరిసర గ్రామాల ప్రజలు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరుచేసి శంకుస్థాపన చేసినా పనులు ప్రారంభం కాలేదని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, రమేశ్, సత్తయ్య, చంద్రం, బాలు, ప్రకాశ్, రాజు, మహేశ్, పోచయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయండి



చంద్రం

దుబ్బాకటౌన్: ఆంధ్రప్రదేశ్‌లో లాగానే ఇక్కడ కూడా మాజీ సైనికుల సంక్షేమం కోసం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని మాజీ సైనికుల రిజర్వేషన్ కోటా ఐదు శాతానికి పెంచాలని రిటైర్డ్ ఆర్మీ జవాన్ నీల చంద్రం డిమాండ్ చేశారు. ఆదివారం రాయపోల్‌లో ఆయన మాట్లాడుతూ దేశ సరిహద్దు రక్షణలో భాగమై రిటైర్ అయిన మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

మూఢ నమ్మకాలపై 'కనువిప్పు'

మద్దూరు(హుస్నాబాద్): మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ షేక్ మహబూబ్ పిలుపునిచ్చారు. మండలంలోని నర్సాయపల్లిలో పోలీస్ కళాబృందం సభ్యులు 'కనువిప్పు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణ, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ మట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని, ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే వెంటనే సమాచారం తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జగదీశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతూన్న ఎస్ఐ

అ'పూర్వ'సమ్మేళనం



అహ్మదీపూర్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



1977-79బ్యాచ్‌ల విద్యార్థులతో ఉపాధ్యాయులు



సిద్దిపేట ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

దుబ్బాకటౌన్/గజ్వేల్‌రూరల్/సిద్దిపేటజోన్: రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1977- 79బ్యాచ్‌ల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని సందడిగా గడిపారు. విద్యా బుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, కొండల్‌రెడ్డి, మృత్యుంజయశర్మ, లింగారెడ్డి, వైకుంఠం, మల్లారెడ్డి, ప్రస్తుత హెచ్ఎం నాగరాజు పాల్గొన్నారు. అలాగే గజ్వేల్‌రూరల్ మండల పరిధిలోని అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 2001-2002బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు సందడి చేశారు. అనాటి గురువులు యాదగిరి, బషీరొద్దీన్, విష్ణుశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, కనకయ్య, పరమేశ్వరరావు, శంకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సుగుణాకర్, చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరించారు. పూర్వ విద్యార్థులు లింగం, శ్రీనివాస్, బాల్‌రాజుగౌడ్, భూపతి, హరికృష్ణ, కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మి, స్వాతి, స్వప్న, గీత, జ్యోతి, అరుణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల2007 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు స్థానిక మోకిడి నర్సింహారెడ్డి ఫంక్షన్ హాల్‌లో సందడి చేశారు. కార్యక్రమంలో గురువులు తిరుపతిరెడ్డి, అంజయ్య, జమీర్, మోహిన్, శ్రీనివాస్, అశోక్, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే చిన్న తరహా పైలెట్ ప్రోగ్రాం

ఫిషరీష్ సొసైటీ అధ్యక్షుడు రవీందర్



చేపపిల్లలను వదులుతున్న రవీందర్

కొమురవెల్లి(సిద్దిపేట): చెరువులు అందుబాటులో లేకపోయినప్పటికీ భూమి ఉపరితలంమీద చిన్న తరహా చేపల పెంపకాన్ని నిర్వహించే పైలట్ ప్రాజెక్టును త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ ఫిషరీష్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ చెప్పారు. ఆదివారం కొమురవెల్లి చెరువులో స్థానిక మత్స్యకారులతో కలిసి చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య సహకార సంఘాలు అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకొని చేపపిల్లలను పెంచే కార్యక్రమాన్ని చేపట్టినందుకు మత్స్యకారులను అభినందించారు. అవకాశాలను వినియోగించుకొని మత్స్య సహకార సంఘాలు ఆర్థికంగా బలపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహసభ రాష్ట్ర కార్యదర్శి భిక్షపతి, ఈశ్వర్, కిష్టయ్య, గొల్లపల్లి కిష్టయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం



గుర్రపు డెక్కను తొలగిస్తున్న సిబ్బంది

సిద్దిపేటజోన్: బతుకమ్మ పండుగ నేపథ్యంలో ఆదివారం స్థానిక ఎర్ర చెరువు వద్ద మున్సిపల్ కార్మికులు పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. చెరువులో ఉన్న గుర్రపు డెక్కను తొలగించారు. చెరువు కట్ట మీద ఉన్న చెత్తాచెదారం, పొదలను తొలగించారు. పారిశుద్ధ్య పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు పర్యవేక్షించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణంలోని ప్రజలు చెరువులో బొడ్డెమ్మ, చిన్న బతుకమ్మలను నిమజ్జనం చేస్తారని, వేగవంతంగా పనులు చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కాంగ్రెస్‌లో చేరికలు**

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కమలాయపల్లికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో బాలయ్య, మల్లయ్య తదితరులున్నారు. కార్యక్రమంలో రవి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, శంకర్, నాని, శంకరాచారి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **రెడ్డి సంక్షేమ సంఘం నూతన కమిటీ**

చేర్యాల(సిద్దిపేట): రెడ్డి సంక్షేమ సంఘం పట్టణ నూతన కమిటీ ఎన్నిక పట్టణ కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో జరిగిన ఈ ఎంపికలో గౌరవాధ్యక్షుడిగా నారాయణ రెడ్డి, అధ్యక్షుడుగా ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షుడుగా నర్సిరెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజిరెడ్డి తదితరులు ఎంపికయ్యారు.

◆ **'అక్రమాలకు పాల్పడుతున్న కొమ్మూరి'**



కొమురవెల్లి(సిద్దిపేట): పదవిని అడ్డుపెట్టుకొని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ప్రతాప్‌రెడ్డి వైఖరి నచ్చక సొంత పార్టీ కార్యకర్తలే ఛీ కొడుతున్నారన్నారు. సీపీఎం నాయకుడు మల్లారెడ్డిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. చక్రపాణి, రవీందర్, యాదయ్య, బాలస్వామి, ఎల్లయ్య, భిక్షపతి, భరత్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

◆ **మంత్రి పొన్నంను విమర్శిస్తే ఊరుకోం**

అక్కన్నపేట(హుస్నాబాద్)/కోహెడరూరల్(హుస్నాబాద్): కాంగ్రెస్ పార్టీ, మంత్రి పొన్నం ప్రభాకర్‌పై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని ఆ పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోతుందన్న బాధ భరించలేక మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నీ కోల్పోయి మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, సంజీవ్‌రెడ్డి, ముకుందరెడ్డి, శ్రీనివాస్, త్రిమూర్తి, గణేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు. కోహెడరూరల్ మండలం బస్వాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాదేమో అని మాజీ ఎమ్మెల్యేకు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు.

భవిషత్ కార్యాచరణ

మిరుదొడ్డి(దుబ్బాక): మాలలపై జరుగుతున్న అన్యాయాలను ఎదించడానికి భవిషత్ కార్యాచరణ రూపొందిస్తున్నామని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర పొలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ బోరబండలోని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ సెంటర్‌లో బుధవారం జాతీయ మాల మహానాడు రాష్ట్ర విస్తృత సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అన్ని జిల్లాల నుంచి నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ధారస్వామి, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు రాజేశ్, మల్లయ్య, సుదర్శన్, సుమన్, రమేశ్, రాములు, కార్తీక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో మేడ్చల్ ఎమ్మెల్యే



స్వామిని దర్శించుకున్న మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామిని మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నింపాలంటూ వినతి

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని వీరన్నపేటలో కాకతీయుల కాలంనాటి మిథునమ్మ చెరువులోకి వరదనీరు వచ్చే వీలులేక చెరువు నిండలేదని, తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదలచేసి చెరువు నింపాలని పలువురు గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మల్లేశం, శ్రీకాంత్, కరుణాకర్, నర్సింహులు, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని దుబ్బతండా పంచాయతీ పరిధిలోని రాజుతండాకు చెందిన ఆర్మీ జవాన్ గుగులోతు బికాన్‌నాయక్‌ను బీజేపీ రాష్ట్ర నాయకుడు గుగులోతు తిరుపతినాయక్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుమూల గిరిజనతండా నుంచి దేశ సేవలో కీలకమైన బాధ్యతను పోషించడంపై హర్షం వ్యక్తం చేశారు. బెంగళూర్‌లోని ఎంఈజీ-మద్రాస్ ఇంజనీరింగ్ గ్రూప్‌లో ఇండియన్ ఆర్మీ ఇన్‌స్పెక్టర్‌గా బికాన్ విధులు నిర్వర్తించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజునాయక్, రాజలింగం, తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.



బికాన్‌ను సన్మానిస్తున్న నేతలు

రెండు రోజులు శ్రమదానం చేయండి



ఎల్లమ్మ చెరువు కట్టపై యోగాసనాలు

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, వారంలో రెండు రోజులపాటు శ్రమదానం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎల్లమ్మ చెరువు కట్టపై ధర్మవీర్ శిక్షణ యోగ సభ్యులు, వాకర్స్, స్విమ్మర్ సభ్యులు కలిసి యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి, హానికరమైన చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహన సిబ్బందికి అందించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు లావణ్య, భాగ్యరెడ్డి, సుప్రజ తదితరులు ఉన్నారు.

మొక్కలు పెంచిన వారికి బహుమతులు



సైకిల్ గెలుపొందిన ప్రత్యూషరెడ్డి

హుస్నాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒకరు మొక్కలు నాటాలని సమాజిక సేవకుడు శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. పందిల్ల గ్రామంలోని 5జీ టౌన్‌షిప్‌లో ఆదివారం మొక్కలు నాటిన వారికి బహుమతులు అందించారు. రెండు నెలల నుంచి గ్రామాల్లో మొక్కలు నాటి సంరక్షిస్తున్న వారికి 5జీ టౌన్ షిప్ సౌజన్యంతో ఒకరు సైకిల్, స్టీల్ వాటర్ బాటిల్స్‌ను అందించారు. పర్యావరణం కోసం ప్రతినెలా మొక్కలు పెంచేవారికి బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సేవాభావమే లయన్స్ క్లబ్ ధ్యేయం

- వరద బాధితులకు అండగా క్లబ్
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా గవర్నర్



నిత్యావసరాలు అందజేస్తున్న వేంకటేశ్వర్‌రావు

కోహెడ(హుస్నాబాద్): సేవా భావమే లయన్స్ క్లబ్ ముఖ్య ధ్యేయమని క్లబ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా గవర్నర్ పెల్లి వేంకటేశ్వర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వర గార్డెన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కోహెడ 320జీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వరద బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత 2న భారీ వర్షంతో బాడుగుల చెరువు మత్తడి వరద ప్రవాహంతో నష్టపోయిన 86 కుటుంబాలకు సుమారు రూ.2.5లక్షలు విలువగల 20రకాల నిత్యవసర సరుకులు అందజేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సౌజన్యంతో నిత్యవసర సరుకుల కోసం సుమారు రూ.8లక్షలు మంజూరు చేసిందన్నారు. రానున్న రోజుల్లో కూడా పేదలకు సేవా కార్యక్రమాలు చేసేందుకు అండగా లయన్స్ క్లబ్ ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో కోహెడ ప్రతినిధులు జగన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రసాద్, జగన్, లక్ష్మయ్య, తిరుపతిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, రవీందర్, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంతో పేదలకు అన్యాయం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రాజు




మాట్లాడుతున్న రాజు

కొమురవెల్లి(సిద్దిపేట): కేంద్రం తీసుకువస్తున్న జాతీయ నూతన విద్యా విధానం వల్ల పేదలు విద్యకు దూరం అవుతారని, దానికి రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలకడం దారుణమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న విద్యవైజ్ఞానిక శిక్షణ తరగతులకు ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకారవేతనాలను, ఫీజు రియింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంఈఓ, టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ పూజ, సహాయ కార్యదర్శి మమత, ప్రశాంత్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి



చెక్‌ను అందజేస్తున్న హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ముందుకు సాగుతోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం సహాయనిధి భరోసాగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో అత్తు ఇమామ్, కలిమొద్దీన్, గోపీకృష్ణ, సంతోషి, సందీప్, పాండు, వాహబ్, అజ్మత్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేపల మృతిపై విచారణకు డిమాండ్

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రంలోని అక్కరవేణి పోచయ్యకు చెందిన చైల చెరువులో చేపలు మృతి చెందిన ఘటనపై విచారాణ చేపట్టాలని ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన బెజ్జంకిలో పోచయ్యను పరామర్శించి చేపల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోచయ్యకు ఆర్థిక సహాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రశాంత్, పాపయ్య, రాజు, బాలేశ్, తిరుపతి పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న శ్రీనివాస్ తదితరులు